# నిత్యం ప్రజల్లోనే..

- రూ.వేల కోట్లతో ఊరూరా కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ జాతర
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు విస్తృత పర్యటనలతో నూతనోత్తేజం
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో నిత్యం ప్రజల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు
- గులాబీ పార్టీలోకి భారీగా వలసలు.. డైలమాలో బీజేపీ, కాంగ్రెస్..
- కదన కుతూహలంతో బీఆర్ఎస్ శ్రేణులు



షాద్‌నగర్ సభావేదికపై మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

రంగారెడ్డి, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ) : 'రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అన్ని అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండాను ఎగుర వేసేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు, కొత్తగా చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థులు క్షేత్రస్థాయిలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. జిల్లా మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వరుసబెట్టి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అసలు స్వరూపాన్ని ప్రజల సమక్షంలోనే ఎండగడుతున్నారు. మరోపక్క ఇతర పార్టీల నుంచి భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు ఊపందుకున్నాయి. ఇవన్నీ.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నయా జోష్‌ను నింపుతున్నాయి.'

**డైలమాలో కాంగ్రెస్, బీజేపీలు**

పర్యటనల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. అలాగే నేతలు చేస్తున్న ప్రసంగాలకు జై కొడుతూ మద్దతు పలుకుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు, భారీ బహిరంగ సభలకు సైతం పెద్ద ఎత్తున అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి నేతల ప్రసంగాలను ఆసక్తిగా వింటున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ప్రసంగాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నేతలు వ్యూహాత్మకంగా తిప్పికొడుతున్నారు. గత పదేండ్లుగా తాము చేసిన అభివృద్ధి పనులు నిజమైతేనే బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని బహిరంగంగా సవాల్ విసురుతుండడం ప్రజలను మరింతగా ఆకర్షిస్తున్నది. అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ ఓ వైపు పార్టీ శ్రేణులను ఉత్తేజ పరుస్తూనే.. బీజేపీ, కాంగ్రెస్‌పై ఎదురుదాడి కొనసాగించి రెండు పార్టీల బండారాన్ని ప్రజల సమక్షంలో బట్టబయలు చేస్తున్నారు. జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్, బీజేపీలను డైలమాలో పడేస్తున్నాయి.

**బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న వలసల వెల్లువ**

జిల్లాలో బీఆర్ఎస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధితోపాటు గడపగడపకూ చేరుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌వైపు ఆకర్షితులవుతున్నారు. పార్టీ విధానంపై బీఆర్ఎస్ పార్టీలో ఉన్న స్పష్టత మరే పార్టీలో లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీల నుంచి వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. చేరుతున్న వారిలో ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలతోపాటు క్రియాశీలక కార్యకర్తలు ఉంటున్నారు. కొన్నిచోట్ల ఇతర పార్టీలకు స్థానం లేకుండా ఊరంతా బీఆర్ఎస్‌వైపే వస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ప్రతి నిత్యం మంత్రి సబితా ఇంద్రారెడ్డితోపాటు, ఎమ్మెల్యేల సమక్షంలో నిత్యం భారీగా చేరికలు ఉంటున్నాయి. ఇవన్నీ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు కొండంత బలాన్నిస్తున్నాయి.

## ప్రజలతో మమేకమై..

బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లాలో కంటిన్యూగా కార్యక్రమాలను చేపడుతున్నది. జిల్లా మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు, ఎమ్మెల్యేలంతా కార్యకర్తలతో కలిసి పర్యటిస్తున్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేసిన అభివృద్ధితోపాటు, చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వరుసబెట్టి జిల్లాలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపుతున్నారు. ఈ నెలలోనే మంత్రి హరీశ్‌రావు జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. ఈనెల 1న మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పర్యటించి మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేశారు. జల్‌పల్లిలో కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో నూ పాల్గొన్నారు. ఈ నెల 6న మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం అల్పాహారం పథకం ప్రారంభోత్సవంలోనూ పాల్గొన్నారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గత సెప్టెంబర్ 27న చేవెళ్ల నియోజకవర్గంలో పర్యటించి చందన్‌వెళ్లి, సీతారాంపూర్‌లో రూ.1,550కోట్లతో ఏర్పాటు చేస్తున్న రెండు కంపెనీలకు శంకుస్థాపన చేశారు. అక్టోబర్ 5న షాద్‌నగర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు చేసి ప్రగతి నివేదన సభలోనూ పాల్గొన్నారు. జిల్లాలో రూ.2,014కోట్ల వ్యయంతో 23,600 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతుండగా ఇప్పటివరకు మంఖాల్, మన్‌సాన్‌పల్లి, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, షాద్‌నగర్ తదితర ప్రాం తాల్లో నిరుపేదలకు ప్రభుత్వం అందజేసింది. మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, మహమూ ద్ అలీ, పట్నం మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతం లో కార్యక్రమాలను నిర్వహిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ లు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌తోపాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రజల మధ్యలోనే ఉంటున్నారు.



ఆమనగల్లులో 50 పడకల ప్రభుత్వ దవాఖాన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ (ఫైల్)

# బీఆర్ఎస్ పథకాలతో విపక్షాలు బేజారు

- కేటీఆర్ కృషితో ప్రపంచ చిత్రపటంలో రంగారెడ్డిజిల్లా ఉనికి
- రానున్న రోజుల్లో హైటెక్ సిటీగా మారనున్న షాబాద్
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో ఉమ్మడిజిల్లాలో 6లక్షల ఎకరాలకు సాగునీరు
- సీఎం అల్పాహార పథకం పేద విద్యార్థుల పాలిట వరం
- మరోసారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించండి
- రూ. 40కోట్లతో షాబాద్ మండలం సర్వతోముఖాభివృద్ధి
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి
- షాబాద్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి, పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి
- అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో ఘనస్వాగతం పలికిన గులాబీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేంద్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, అక్టోబర్ 7 : ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా నేడు పారిశ్రామిక ఖిల్లాగా మారిందని, దేశానికి ఆదర్శవంతమై నిలుస్తున్నదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండలంలోని హైతాబాద్, మాచన్‌పల్లి, మల్లారెడ్డిగూడ, పోలారం గ్రామాల పరిధిలో రూ.8.65కోట్ల నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి తదితరులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశానికే దిశ దశ చూపించేలా అభివృద్ధి పథంలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నదన్నారు. షాబాద్ మండలం లో ఏర్పాటవుతున్న పెద్ద పెద్ద పరిశ్రమలతో ప్రపంచ దేశాల చూపంతా షాబాద్ వైపే ఉందన్నారు. త్వరలో శంషాబాద్ నుంచి నాగరగూడ వరకు రోడ్డు విస్తరణ కానున్నదని, ఈ ప్రా ంతం మరింత అభివృద్ధి చెందనున్నట్లు స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 6లక్షల ఎకరాలకు సాగునీరు అందబోతున్నదని తెలిపారు. హైదరాబాద్ విశ్వ నగరంగా ఉనికిని చాటుకుంటే పరిసర ప్రాంతాల్లో పల్లెలు హైదరాబాద్ నగరానికి సమాంతరంగా మౌలిక సదుపాయాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని వివరించారు. సీఎం అల్పాహార పథకం పేద విద్యార్థుల పాలిట ఒక వరంగా మారుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమ లు చేస్తున్న పథకాలతో ప్రతిపక్షాలు దిమ్మదిరిగి తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఎవరికి వస్తుందో కూడా తెలియదని, బీజేపీ పార్టీ అసలు ఉనికే లేదని, ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించి బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి సీఎంగా కేసీఆర్‌ను, ఎమ్మెల్యేగా కాలె యాదయ్యను మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. గత 40 ఏండ్లు గా తమ(పట్నం)కుటుంబానికి రాజకీయంగా ఎదిగేందుకు సహకరిస్తున్న మండల ప్రజలను ఎప్పటికీ మరిచిపోమన్నారు.

**తెలంగాణ ఏర్పాటు తర్వాత..**

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మహేందర్ రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృషితోనే షాబాద్ మండలానికి పెద్ద ఎత్తున కంపెనీలు తీసుకొచ్చి ఈ ప్రాంత రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. కంపెనీల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. సీతారాంపూర్‌లో ఏర్పాటవుతున్న కిటెక్స్ కంపెనీలో సుమారు 15 వేల మంది వరకు మహిళలకు ఉపాధి లభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో హ్యాట్రిక్ సాధించనున్న సీఎం కేసీఆర్ తనకు కూడా మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని, ప్రజలందరూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు.

**పల్లె పల్లెలో అభివృద్ధి పనులు**

జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...గ్రామాల్లో పల్లె పల్లెకు అవినాశ్‌రెడ్డి అనే కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించామన్నారు. హంకుగూడకు రోడ్డు వేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారమే రూ.కోటి నిధులతో హంకూగూడ, రూ.2కోట్లలో పోలారానికి, రూ.6కోట్లతో మాచన్‌పల్లి-పోతుగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, ఎంపీడీవో అనురాధ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు మల్లేశ్, మహేందర్‌రెడ్డి, మంగమ్మ, ఇస్మత్‌బేగం, జంగయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, యాదయ్య, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, హైతాబాద్ మాజీ సర్పంచ్ దర్శన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, నాయకులు రాజూగౌడ్, సురేశ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, గోపాల్, చక్కటి దేవేందర్‌రెడ్డి, శివకుమార్, పరిగి గణేశ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌నాయక్, రాంచంద్రారెడ్డి, దర్శన్, కృష్ణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, మునీర్, బల్వంత్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, నరేశ్, బుర్ర రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యకు జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు